

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వర్‌రావు పిలుపినిచ్చారు. బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు ఆదివారం మేడిబావిలోని తన నివాసంలో పలువురు నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కాలుష్య నివారణకు ప్రస్తుత వర్షా కాలంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. – సికింద్రాబాద్, జూన్ 30

జీహెచ్ఎంసీలో విలీనం..

## సంబురాలు

మారేడ్‌పల్లి, జూన్ 30: కంటోన్మెంట్ సివిలియన్స్ ఏరియాలను జీహెచ్ఎంసీలో విలీనమైన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్, కాంగ్రెస్ నాయకులతో కలిసి సంబురాలు జరుపుకున్నారు. ఆదివారం పికెట్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి పటాకులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ...సీఎం చొరవతో కంటోన్మెంట్ ప్రాంతం జీహెచ్ఎంసీలో విలీన ప్రక్రియ జరిగిందన్నారు. గతంలో స్థానికంగా ఎంపీగా ఉన్నప్పుడు సైతం అనేక సార్లు కంటోన్మెంట్ బోర్డు సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంకి రవీందర్, సదానంద్‌గౌడ్, సి. సంతోష్ యాదవ్, సరిత తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి స్తంభించింది..!

- గడిచిన 8 నెలలుగా ఎక్కడి పనులు అక్కడే..
- మంజూరైన పనులు, నిధుల నిలిపివేత
- శ్రావణమాసం నుంచి ప్రజా క్షేత్రంలోకి..
- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట్, జూన్ 30: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సనత్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి మంజూరు చేసిన పనులు, నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ విధానాల ఫలితంగా గడిచిన ఆరు నెలల్లో అభివృద్ధి స్తంభించిందన్నారు. సనత్‌నగర్ డివిజన్‌లోని ఉదయ్‌నగర్ పార్కులో ఏర్పాటు చేసిన పిల్లల ఆట పరికరాలు, ఓపెన్ ఎయిర్ జిమ్‌ను కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డి, కాలనీ నివాసితులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సనత్‌నగర్ నియోజకవర్గ ప్రజలు ఊహించని రీతిలో అభివృద్ధి పనులు జరిగాయని, చిన్న కాలనీలు, పెద్ద కాలనీలు అనే తేడా లేకుండా నియోజకవర్గం అణువణువునా ప్రజలు కోరుకున్న అభివృద్ధిని చేసి చూపించామన్నారు.

సకల వసతులతో కూడిన ఈఎస్ఐ శ్మశానవాటికను తీర్చిదిద్దేందుకు రూ. 3 కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. శ్మశానవాటికను రాష్ట్రంలోనే మోడల్‌గా తీర్చిదిద్దేందుకు వీలుగా మరిన్ని వసతులతో, అవసరమైతే ఈ నిధులను రూ. 8 కోట్ల వరకు పెంచేందుకు కూడా గత ప్రభుత్వం సిద్ధమైందన్నారు. అదేరీతిలో బేగంపేట్ కబరస్తాన్, ఉదయ్‌నగర్‌లో కమ్యూనిటీ హాలు నిర్మాణం వంటి అనేక పనులకు సంబంధించి మంజూరైన అనుమతులు, నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడంతో అభివృద్ధి పూర్తిగా స్తంభించిపోయిందన్నారు. నిధులతో పనులు లేకుండా కనీస మరమ్మతులతో జరగాల్సిన పనులను చేపట్టే విషయంలో కూడా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.



ఉదయ్‌నగర్ పార్కులో కాలనీ నివాసితులతో మాట్లాడుతున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని

### శ్రావణమాసం నుంచి ప్రజాక్షేత్రంలోకి..

తన కుటుంబంలో చోటు చేసుకున్న విషాదకర ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందని, ఈ కారణంతో కొంత సమయం తాను రాజకీయ వ్యవహారాలకు దూరం కావలసి వచ్చిందని తలసాని పేర్కొన్నారు. ఆషాఢ మాసం పూర్తయిన వెంటనే శ్రావణ మాసంలో తాను తిరిగి ప్రజాక్షేత్రంలోకి వస్తానని స్పష్టం చేశారు. ప్రజా అవసరాలను నిర్లక్ష్యం చేసే క్రమంలో అధికారులపై, ప్రభుత్వంపై వత్తిడి తీసుకొచ్చే పనులను చేపడతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉదయ్‌నగర్ కాలనీ అధ్యక్షులు శ్రీకాంత్, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.కోటేశ్వర్‌రావు, ఎంవీవీఎస్ఎన్ మూర్తి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి కృషి

కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు పరిధిలోని సరస్వతినగర్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, వరద నీరు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో కాలనీ వాసులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బీఎస్ఎన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లారెడ్డి, అసిస్టెంట్ కార్యదర్శి సాయిబాబా పాల్గొన్నారు. –బొల్లారం, జూన్ 30:



ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు ఆదివారం వీక్షించారు. మోదీ మూడోసారి ప్రధాన మంత్రి అయిన అనంతరం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. మేడిబావిలో బీజేపీ నాయకుడు కనకట్ల హరి, అరవింద్ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. – సికింద్రాబాద్, జూన్30:

# తలసాని శంకర్ యాదిలో..

డీసీఎం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని

మారేడ్‌పల్లి, జూన్ 30: బోయిన్‌పల్లి మార్కెట్ ఆవరణలో తలసాని శంకర్ యాదవ్ జ్ఞాపకార్థం డీసీఎం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శంకర్ యాదవ్ సోదరుడు, మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా శంకర్ యాదవ్ చిత్రపటానికి స్థానికులతో కలిసి పూలమాల వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ... బోయిన్‌పల్లి, మోండా మార్కెట్‌లకు అధ్యక్షుడిగా ఉన్న తలసాని శంకర్ యాదవ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, డైరెక్టర్ గిరిధర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గజ్జెల నాగేష్, శంకర్ యాదవ్ సోదరులు నర్సింగ్ యాదవ్, మహేష్ యాదవ్, ధర్మేందర్ యాదవ్, స్కైలాబ్ యాదవ్, డీసీఎం అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేష్, ప్రధాన కార్యదర్శి నర్సింహ, జనార్దన్, బీరయ్య పాల్గొన్నారు.



బోయిన్‌పల్లి మార్కెట్ ఆవరణలో శంకర్ యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, డీసీఎం అసోసియేషన్ ప్రతినిధులు

# దేశ అవసరాలను బట్టి చట్టాలను మార్చుకోవాలి

హిమాయత్‌నగర్, జూన్ 30: మార్పులకు అనుగుణంగా ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకోవాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఫోరం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్ ఆధ్వర్యంలో ఆదివారం నారాయణగూడ కేశవమెమోరియల్ ఆడిటోరియంలో 'న్యూ క్రిమినల్ మేజర్ యాక్ట్స్' అంశంపై వర్క్‌వర్క్‌షాప్ జరిగింది. మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశ అవసరాలను బట్టి చట్టాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంటుందన్నారు. దేశంలోని బాంబేను ముంబైగా, కలకత్తాను కోల్కతగా, మద్రాస్‌ను చెన్నైగా మార్చారని అన్నారు. అదే బీజేపీ ఆధ్వర్యంలో మార్పులు చేస్తే మాత్రం వ్యతిరేకించేవారని ఆరోపించారు. దేశంలో అందరిని పరిగణలోకి తీసుకుని చట్టాల్లో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికీ బ్రిటీష్ చట్టాలనే అనుసరిస్తున్నామని, వారి చట్టాలను ఎందుకు కొనసాగించాలని ప్రశ్నించారు. ప్రధాని మోదీ దేశానికి మేలు జరిగేలా చట్టాల్లో మార్పులు తెచ్చేందుకు కృషి చేస్తున్నారని వివరించారు. ఇండియా గేట్ వద్ద కొందరి బ్రిటిష్ వాళ్ల విగ్రహాలు ఉంటే వాటిని తొలగించి సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఆవిష్కరించామని వివరించారు. టెక్నాలజీ అవసరాలను వినియోగించడం, నేరాలను కట్టడి చేసేందుకు ఐసీపీ, సీఆర్‌పీసీ చట్టాలను సైతం మార్చి దేశ ప్రగతికి ప్రయోజనాలు కలిగే చట్టాలను కేంద్రం తీసుకువచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి, ప్రతినిధులు హనుమంతరెడ్డి, రామారావు, సురేశ్, భరత్ గోగియా, సునీల్‌గౌడ్, బి.నర్సింహశర్మ పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



## బోర్డు అభివృద్ధికి కృషి చేయండి

రాష్ట్ర గవర్నర్ సీపీ.రాధాకృష్ణన్‌ను రాజ్‌భవన్‌లో ఆదివారం కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన వివిధ సర్వీస్ చార్జెస్ విడుదల, బొల్లారం కంటోన్మెంట్ దవాఖానలో అత్యాధునిక ఆస్పత్రిగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సెక్రటరీ డాక్టర్ నరసింహన్ కన్నన్, మైనార్టీ నాయకులు ఆయూబ్ ఖాన్, జమీల్, సీనియర్ నాయకులు గజ్వేల్ భరత్, రాజేష్ యాదవ్ పాల్గొన్నారు. – బొల్లారం, జూన్ 30:

## కోటపై ఏర్పాట్లు





బోనాలు అంటే టక్కున గుర్తు కొచ్చేది గోల్కొండ బోనాలు. అంత ప్రాచుర్యం పొందింది గోల్కొండ కోట. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఆషాఢ మాస బోనాలకు గోల్కొండ కోట ముస్తాబవుతున్నది. దానిలో భాగంగా జూలై మొదటి ఆదివారం నుంచి ప్రారంభం కానున్న బోనాల వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.



## పదవీ విరమణ

సమస్యాత్మకంగా మారిన సనత్‌నగర్ జెక్ కాలనీ ఆదివారం అంగడి సమస్యను పరిష్కరించే క్రమంలో కాలనీ పరిసరాల్లోకి వర్తకులు చొచ్చుకురాకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంలో బాలానగర్ ట్రాఫిక్ ఎస్ఐ రాజేశ్వర్ తన విధులను సమర్థవంతంగా నిర్వహించారని కాలనీ రెసిడెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షులు డాక్టర్ మల్లు ప్రసాద్ పేర్కొన్నారు. ఎస్ఐ రాజేశ్వర్ పదవీ విరణను పురస్కరించుకుని బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెక్‌కాలనీ ప్రతినిధులు పాల్గొని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంజర్ల శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు లింగంపల్లి నర్సింగ్‌రావు, సుదర్శన్‌రావు, అనంతరెడ్డి, శివారెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మణ్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు. – అమీర్‌పేట్, జూన్ 30

## సంగీత నృత్య కళారూపాలను పరిరక్షించుకోవాలి

చిక్కడపల్లి, జూన్ 30 : నటరాజ్ నృత్య నికేతన్, శ్రీలలిత కళా నృత్య నికేతన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రలో భారతీయ సంగీత నృత్యోత్సవం– 12 శంభో శివ శంభో పేరట సంగీత నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. కవి విశ్లేషకులు చినుకు పి.ఎన్. మూర్తి, నటరాజ్ నిత్య నికేతన్ వ్యవస్థాపక నాట్య గురువులు జట్ల చిన్న వీరభద్రరావు, డాక్టర్ అరవ ఆంజనేయులు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతీయ శాస్త్రీయ సంగీత నృత్య కళారూపాలను పరిరక్షించుకోవాల్సి బాధ్యత అందరిపై ఉందన్నారు. మొదటి రోజు 300 మంది, రెండవ రోజు 175 మంది సంగీత నృత్య కళాకారులు, చక్కటి ప్రదర్శనలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నజీయర్ స్వామి అస్థాన గురువులు ఘంటసాల పవన్ కుమార్, సీనియర్ జర్నలిస్టు డి.సుమన్, వి. నాగబాబు, ప్రముఖ నాట్యాచార్యులు శ్రీ తాతా వెంకట వరప్రసాద్, నాట్యగురువులు లాస్య రంజని పాల్గొన్నారు. ఈ సందర్భంగా నృత్య గురువులను సన్మానించారు.



కళాకారుల నృత్య ప్రదర్శన

సైకాలజిస్ట్స్ కౌన్సిల్‌ను

## ఏర్పాటు చేయాలి

హిమాయత్‌నగర్, జూన్ 30: మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రంలో సైకాలజిస్ట్స్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ కోరారు. హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో సంఘం రాష్ట్ర, జిల్లా ముఖ్యనాయకుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న మానసిక రుగ్మతలను రూపుమాపేందుకు సైకాలజిస్టుల సేవలు ఎంతో అవసరమన్నారు. ప్రతి పౌరుడు మానసిక ఒత్తిళ్లను జయించి ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగితే ఉన్నతమైన లక్ష్యాన్ని సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, నాయకులు శ్రీకాంత్, బాల సుబ్రమణ్యం, వైదేహి, రాజు ఆచార్య, ఉమర్‌ఖాన్, కృష్ణ, సాహితి, శ్రీదేవి పాల్గొన్నారు.

## నిమ్స్‌లో కోలుకున్న చెంచు మహిళ

ఖైరతాబాద్, జూన్ 30: నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మూలచింతలపల్లికి చెందిన చెంచు మహిళ కోలుకున్నారు. ఆదివారం వైద్యులు ఆమెను డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, దయాల జితేందర్ బాధితురాలిని పరామర్శించారు.

# బీసీలు సంఘటితంగా ఉంటే రాజ్యాధికారం

ఖైరతాబాద్, జూన్ 30: బీసీలు సంఘటితంగా ఉంటే రాజ్యాధికారం సొంతమవుతుందని ఢిల్లీ వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ తిరుమలి అన్నారు. బీసీ టైమ్స్, బీసీ సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీల కులాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీల్లో మార్పు వచ్చినప్పుడే అధికారం వారి చేతిలోకి వస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లోనైనా బీసీలు పోటీలో నిలవాలని, గెలుపోటములతో సంబంధం లేకుండా సమాజాన్ని మార్చగలిగే శక్తులుగా ఎదగాలన్నారు. బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగెం సూర్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆల్ ఇండియా బీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ తిరుమలి

కార్యకర్తలకు

## అండగా ఉంటాం

జూబ్లీహిల్స్, జూన్ 30: కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. రహ్మత్‌నగర్ డివిజన్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త జబ్బాన్‌ఖాన్ అనారోగ్య కారణంతో మృతిచెందిన విషయం తెలుసుకొని ఆదివారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈ సందర్భంగా మృతుడి సతీమణికి ఉద్యోగం, పిల్లలకు ఉచిత విద్య, వసతులు కల్పించి ఆదుకుంటామని భరోసానిచ్చారు. జబ్బార్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు అన్ని విధాలుగా అండగా ఉంటానని అభయమిచ్చారు.

## 'నీ స్నేహం కోసం' కథల సంపుటి ఆవిష్కరణ



'నీ స్నేహం కోసం' కథల సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, జూన్ 30 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కామన్ డయాస్ (సాహిత్యం– విద్య–సేవ, జర్నలిజం, రవ్వలకొండ విశ్వబ్రాహ్మణ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో తంగెళ్లపల్లి కనకాచారి రచించిన 'నీ స్నేహం కోసం' కథల సంపుటి పుస్తకావిష్కరణ కార్యక్రమంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ఉద్యమకారుడు రుద్రశంకర్ విచ్చేసి కథల సంపుటిని ఆవిష్కరించా రు. ఈ పుస్తకాన్ని హైమావతి భీమన్నకు అంకితం చేశారు. అనంతరం రచయితలను అభినందించారు. ప్రతిభా పురస్కారాలను అందుకున్న వారి ప్రతిభను ప్రసంశించారు. ఈ కార్యక్రమంలో జీవీఆర్.చారి, శైలజామిత్ర, దైవజ్ఞ శర్మ, రాగరంజని, లలితావాణి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు హక్కులను

## సాధించుకోవాలి

హిమాయత్‌నగర్, జూన్ 30: దేశంలోని పద్మశాలీలు సంఘటితమై హక్కులను సాధించుకోవాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, ఇంజినీర్స్ విభాగం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండురంగయ్య పిలుపునిచ్చారు. ఆదివారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ పద్మశాలీలు రాజకీయ, సామాజిక, ఆర్థికంగా ఎదిగాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు మసున మోహన్‌నారాయణ, చంద్రమౌళి, వేణుమాధవ్, లోక్‌నాథం, మోహన్ కుమార్, విజయప్రసాద్, కృష్ణ, సుధాకర్, వనం రవీందర్, శంకర్, ఎస్.టమార్కొండేయ, యాదగిరి పాల్గొన్నారు.

## నేడు విద్యార్థులకు బహుమతులు పంపిణీ

తెలుగు యూనివర్సిటీ, జూన్ 30 : శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ఆధ్వర్యంలో భారతపూర్వ ప్రధాని పి.వి. నరసింహారావు జయంతి సందర్భంగా జులై 1న సోమవారం సాయంత్రం వ్యాస రచన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతుల పంపిణీ జరుగుతుందని భాషా నిలయం గౌరవ కార్యదర్శి టి. ఉదయవర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.